ప్రజాశక్తి
శనివారం 24 జూన్ 2023
5
శ్రీకాకుళం



'పది' సప్లిమెంటరీలో 73.32 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో 73.32 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈనెల రెండో తేదీ నుంచి పదో తేదీ వరకు నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. పరీక్షలకు మొత్తం 4,562 మంది హాజరు కాగా 3,345 మంది పాస్ అయ్యారు. సప్లిమెంటరీ పరీక్షల్లోనూ బాలికలే అధిక శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్షలకు 1,908 మంది బాలికలు హాజరు కాగా 1,461 మంది (76.57 శాతం) ఉత్తీర్ణత సాధించారు. 2,654 మంది బాలురు పరీక్షలు రాయగా 1,884 మంది (70.99 శాతం) మంది పాస్ అయ్యారు.

సమస్యలు పరిష్కారమయ్యేనా?

- విత్తనాలు దొరక్క అన్నదాతల అవస్థలు
- నేటికీ మొదలు కాని వంశధార నిర్వహణ పనులు
- అపరిష్కృతంగానే షట్టర్ల సమస్య
- ఇళ్ల బిల్లులు అందక లబ్ధిదారుల అవస్థలు
- నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జెడ్‌పి నూతన సమావేశం మందిరంలో శనివారం నిర్వహించనున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాల సమస్య ప్రధానంగా నెలకొంది. విత్తనాలు దొరక్క ప్రయివేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్‌లో ఈ సంవత్సరం సాగునీటి సమస్యలు తప్పేలా లేవు. సీజన్ ప్రారంభమైనా వంశధార కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగించలేదు. షట్టర్ల అవినీతిపై సిఐడి కేసు ఉండడంతో కొత్తవి అమర్చకపోవడంతో పాడైన వాటితోనే నెట్టుకొస్తున్నారు. ఇళ్ల బిల్లులు రాక వేలాది మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటితోపాటు విద్యుత్, ఆర్ అండ్ బి రోడ్లు తదితర సమస్యలూ ఉన్నాయి. వీటిపై సభ్యులు చర్చించి ఏం పరిష్కారం చూపుతారన్నది అంతా ఎదురుచూస్తున్నారు.

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండడంతో, నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకు పోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో 1800 క్యూసెకులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. వంశధార కుడి, ఎడమ కాలువల ద్వారా ఈసారి శివారు భూములకు సాగునీరందడంపై అనేక సందేహాలు నెలకొన్నాయి. రెండు కాలువల్లోనూ విపరీతంగా గుర్రపుడెక్క పేరుకుపోయింది. దాన్ని పూర్తిగా తొలగిస్తే గానీ నీరు స్వేచ్ఛగా పారే అవకాశం లేదు. గుర్రపుడెక్క, పూడికతీత పనులకు ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రూ.60 లక్షలను కేటాయించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా ఇప్పటికీ పనులు మొదలు కాలేదు. గత ఖరీఫ్‌లో ఎడమ కాలువ పరిధిలోని పోలాకి, నరసన్నపేట, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని చాలా గ్రామాలకు సాగునీరందలేదు. కుడి కాలువ పరిధిలోని గార మండలంలో పంటలు ఎండిపోయిన పరిస్థితులు తలెత్తాయి. దీంతో ఈ సంవత్సరమూ నీరందుతుందో లేదోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.



విత్తనాల కొరతతో డీలర్ల వద్ద కొనుగోళ్లు

ప్రస్తుత ఖరీఫ్‌కు అన్నిరకాల విత్తనాలు 35,040 క్వింటాళ్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం 24,285 క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేయనున్నట్లు తెలిసింది. జిల్లాలో ఈ ఏడాది ఎంటియు 1061 రకం సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ రకం విత్తనాలను సరఫరా చేసేందుకు వ్యవసాయశాఖ 9,787 క్వింటాళ్లు అవసరమని ప్రతిపాదనలు పంపింది. అదేవిధంగా స్వర్ణ రకం విత్తనాలు 7,433 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. విత్తనాల కొరతతో పాటు రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో, ప్రయివేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు.

వెంటాడుతున్న వరద భయం

కరకట్టలకు సంబంధించి కొత్త ప్రాతిపాదనలను అధికారులు పంపి ఏడాదిన్నర గడుస్తున్నా ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. నిర్మాణ వ్యయం అధికంగా ఉండడంతో వైసిపి ప్రభుత్వం వాటిని ఉన్నపళంగా ఆపేసింది. ముంపు తీవ్రత అధికంగా ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి నది పరివాహక ప్రాంతంలో ఐదు ప్రాంతాలను గుర్తించి, అక్కడ కరకట్టల నిర్మాణానికి రూ.13.5 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రతిపాదించారు. వంశధార వెంబడి మొత్తం 23 కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం చేపట్టేందుకు రూ.130 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ రెండింటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఆమోదం తెలపలేదు.

షట్టర్ల సమస్యకు ఏం పరిష్కారమో?

నరసన్నపేటలో 2009లో నమోదైన సిఐడి కేసు 13 ఏళ్లు గడుస్తున్నా తేలకపోవడంతో, కాలువలపై ఏర్పాటు చేయాల్సిన షట్టర్లు కార్యాలయాల్లోనే మూలుగుతున్నాయి. హిరమండలం, టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కార్యాలయాల్లో సుమారు రూ.నాలుగు కోట్ల నుంచి రూ.ఐదు కోట్ల విలువ చేసే షట్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పాడైపోవడంతో కాలువలపై బిగించడానికి అవకాశం లేకుండా పోయింది. వీటిని వేలం వేసి కొత్తగా కొనుగోళ్లు చేయాలంటే కేసుకు ముగింపు పలకాల్సి ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై జిల్లాకు చెందిన మంత్రులు దృష్టిసారిస్తే సమస్య పరిష్కారం కాగలదని అంతా భావిస్తున్నారు.

బీమా డబ్బులకు పాడి రైతుల ఎదురుచూపులు

జిల్లాలో రెండేళ్ల కాలంలో సుమారు 2,400 పశువులు మరణించాయి. మరణించిన పశువులకు సంబంధించి సుమారు రూ.14 కోట్లు రావాల్సి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు కలిసి తమకు ఎప్పుడు డబ్బులు వస్తాయా అని అడుగుతున్నారు. ప్రభుత్వం పాత బీమా పథకాన్ని రద్దు చేసి దాని స్థానంలో కొత్త పథకం అమలుకు జిఒ ఇచ్చినా అది అమలు కాలేదు. దీంతో పశువులు మరణించినా పథకంలో నమోదు కాకపోవడంపై పాడి రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ఇళ్ల నిర్మాణ బిల్లులు రాక ఇబ్బందులు

జిల్లాలో 2014 నుంచి 2018 వరకు నిర్మించిన ఎన్‌టిఆర్ గృహాలకు ఇప్పటికీ ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు. ఇళ్ల కేటాయింపులు, నిర్మాణాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలతో ప్రభుత్వం వాటికి డబ్బులు ఆపేసింది. ఇళ్లను పరిశీలించి డబ్బులు చెల్లిస్తామని చెప్పినా ఇప్పటివరకు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేయలేదు. జిల్లాలో సుమారు 19 వేల ఇళ్లకు సుమారు రూ.285 కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. డబ్బుల కోసం లబ్ధిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ భారాలను ప్రతిఘటించాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపిన విద్యుత్ భారాలను ప్రజలందరూ ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్‌డ్, ట్రూ అప్, కస్టమర్ ఛార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతోందని విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు అదనపు ట్రూ అప్ ఛార్జీ పేరుతో ఇప్పుడు వసూలు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. దీనివల్ల గతంలో అద్దెకున్న వాళ్లు వాడుకున్న కరెంట్‌కు ఇప్పుడు అద్దెకు ఉన్న వారు చెల్లించాల్సి వస్తోందన్నారు. పాలకులు, కార్పొరేట్ సంస్థలు కుమ్మక్కై రూ.రెండుకు కొనాల్సిన యూనిట్ విద్యుత్‌ను రూ.12 వరకు కొంటున్నారని విమర్శించారు. ఇటీవలే హిందూజా కంపెనీకి రూ.1200 కోట్ల అదనపు ఛార్జీల పేరుతో ప్రభుత్వం చెల్లించిందన్నారు. స్మార్ట్ మీటర్ పేరుతో విద్యుత్ రంగాన్ని మొత్తం అదానీకి అప్పగిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటరు రూ.13 వేలు చొప్పున అదానీతో అగ్రిమెంట్ చేసుకుని పదేళ్ల పాటు నెలకు రూ.120 నుంచి రూ.150 వసూలు చేయడానికి కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రపంచబ్యాంకు షరతులకు తలొగ్గి విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసిందని, ఆ విద్యుత్ సంస్కరణలను వైసిపి ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తుందని విమర్శించారు. సర్దుబాటు ఛార్జీల వసూలు నిలిపివేయాలని, విద్యుత్‌రంగ ప్రయివేటీకరణ ప్రభుత్వాలు విరమించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గృహ వినియోగదారులకు వంద యూనిట్ల లోపు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని, విద్యుత్ పంపిణీ సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అదానీతో సహా పలు కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్.అమ్మన్నాయుడు, కోరాడ అప్పన్న, తోణంగి రాజారావు, పలు సంఘాల నాయకులు టి.రామారావు, రాము, జి.శ్రీనివాసరావు, కె.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి కుష్టు వ్యాధి సర్వే

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో ఈనెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా కుష్టు వ్యాధి నియంత్రణ అధికారి ఎన్.అనురాధ అన్నారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని ఆమె ఛాంబరులో కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేపై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి, కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించనున్నట్లు తెలిపారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చపై నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా తీసుకోవాలన్నారు. కుష్టువ్యాధిని బహుళ ఔషధ చికిత్స ద్వారా పూర్తి నయం చేయవచ్చన్నారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఇ.ఎస్.ఆర్ కుమార్, పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న స్పీకర్, కలెక్టర్ తదితరులు

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- పక్కా ప్రణాళికతో విజయవంతం చేయాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధికారులను ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలి ఉన్న వారికి అందజేయడమే జగనన్న సురక్ష ప్రధాన లక్ష్యమన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకం అందలేని వారు ఉండకూడదన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించగా, కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్పీకర్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ హాజరయ్యారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇఒఆర్‌డిలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు కచ్చితంగా మండలంలో పర్యటించాలని స్పష్టం చేశారు.

పక్కా ప్రణాళికతో నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సచివాలయాల పరిధిలో ఒక్క ఇల్లూ మిస్ కాకుండా చూడాలన్నారు. వాలంటీర్లు వంద శాతం ఇంటింటికీ వెళ్లాలని స్పష్టం చేశారు. వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్తున్నారా లేదా అనేది పరిశీలన చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ కార్యక్రమ నిర్వహణకు కావాల్సిన పూర్తి సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులకు ముందుగా షెడ్యూల్‌ను అందజేయాలన్నారు. మారుమూల గ్రామాలను సందర్శించేలా షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, డిపిఒ రవికుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గారూ... జీడి మద్దతు ధర ఏది?

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - పలాస

జీడి పంటకు మద్దతు ధర కల్పిస్తామని గొప్పలు చెప్పిన రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఇప్పుడు ఏం చేస్తున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. జీడి రైతులకు అదనంగా ఇస్తామన్న రూ.వెయ్యి ఏమైందన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలోని తాళభద్రలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముందుగా పలాస టిడిపి కార్యాలయం నుంచి తాళభద్ర వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో ఎంపీ మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అప్పులు చేస్తూ అప్పుల రాజు అయితే, పలాస నియోజకవర్గంలో కొండలనూ వదలని మంత్రి అప్పలరాజు కొండల రాజుగా మారారని ఎద్దేవా చేశారు. ఒక్క ఛాన్స్ అంటూ జగన్ రాష్ట్రాన్ని అప్పులపాల్జేశారని, మళ్లీ జగన్ మాయలో పడొద్దన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

విశాఖ వైసిపి ఎంపీ ఈ రాష్ట్రంలో ఉండలేనంటూ తెలంగాణ పారిపోయారని చెప్పారు. నివాసాలకు స్టిక్కర్లు అంటించడం, భవనాలకు నీలి రంగులు వేయడం, పబ్లిసిటీ చేసుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ నియోజవర్గంలో సూదికొండ, నెమలికొండ, ఉజ్జిడి మెట్ట కొండలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే మంత్రి అప్పలరాజు తట్టా బుట్ట సర్దుకుని పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. అనంతరం సుమారు 150 మందికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎల్.కామేశ్వరరావు, జి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. అటువంటి స్కానింగ్ సెంటర్ల లైసెన్స్‌లను రద్దు చేస్తామని, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం అమలుపై జిల్లాస్థాయి సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశు స్థితిగతులు, సమస్యలు తెలుసుకునేందుకే స్కానింగ్ చేయాలి తప్ప వీటిని ఆసరాగా తీసుకుని గర్భస్థ శిశు వివరాలను వెల్లడించడం నేరమన్నారు.

జిల్లాలో 108 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, ప్రతి స్కానింగ్ సెంటరులో సిసి కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు ఆయా కేంద్రాలపై ప్రోగ్రాం అధికారుల ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రుల్లో అబార్షన్ల వివరాలతో పాటు అందుకు తగిన కారణాలను తమకు సమర్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో బెజ్జిపురం యూత్ క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఎన్.అనురాధ, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, సహాయ ప్రొఫెసర్ అనూష, గిరిధర్, ఎస్ఐ కె.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వంశధార నిర్వాసితులకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. వంశధార నిర్వాసితుల సమస్యలపై నగరంలోని వంశధార ప్రాజెక్టు కార్యాలయంలో వంశధార ఎస్ఇ డోల తిరుమలరావుతో శుక్రవారం చర్చించారు. అదనపు పరిహారం కింద రూ.లక్ష పూర్తిస్థాయిలో చెల్లించకుండా సగం మందికే పంపిణీ చేసి చేతులు దులుపుకోవడం అన్యాయమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిర్వాసితుల రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించిన జగన్, 2013 భూసేకరణ చట్టం వర్తింపజేస్తామని హామీనిచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక వాటిని అటకెక్కించారని విమర్శించారు. అర్హులైన వంశధార నిర్వాసితులందరికీ తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఎం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని లేకుంటే నిర్వాసితుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.ఈశ్వరమ్మ, కొల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఇ తిరుమలరావుతో చర్చిస్తున్న వ్య.కా.స నాయకులు

ఒలింపిక్ డే రన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన చేపట్టిన ఒలింపిక్ డే రన్‌ను అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. నగరంలోని పొట్టి శ్రీరాములు కూడలి నుంచి కోడి రామ్మూర్తి స్టేడియం వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం స్టేడియం ఆవరణలో క్రీడాకారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలకు క్రమశిక్షణ తోడైతే మంచి క్రీడాకారులుగా పేరు ప్రఖ్యాతలు సాధిస్తారన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. స్నేహపూరిత వాతావరణం కూడా క్రీడలతోనే సాధ్యమవుతుందని చెప్పారు. రోజూ ఒక గంట క్రీడలకు కేటాయిస్తే ఆసుపత్రికి వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, ఒలింపిక్ అసోసియేషన్ పూర్వ కార్యదర్శి పి.సుందరరావు, ప్రస్తుత కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, డిఎస్‌డిఒ కె.శ్రీధర్, పిఇటి అసోసియేషన్ అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులను మరింత వేగవంతం కావాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్‌ఒలతో శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం గతంలో వేగవంతం చేసినా కార్యక్రమం వెనుకంజలో ఉందన్నారు. స్టోన్ ప్లాంటేషన్ విషయంలో క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొన్నిచోట్ల మందకొడిగా సాగుతోందని, ఇకపై పునరావృతం కారాదని స్పష్టం చేశారు. రీ సర్వేనూ వేగవంతం చేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మురళీకృష్ణ, తహశీల్దార్లు, సర్వేయర్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రైతాంగ సమస్యల పరిష్కారంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. మండలంలోని నిమ్మాడలో క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి హయాంలో రైతులకు అవసరమైన సాగునీరు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందించామన్నారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే సాగునీటి కాలువలు, చెరువుల మరమ్మతు పనులకు సంబంధించి సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించి, ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టామని చెప్పారు. హుదూద్, తిత్లీ తుపాన్లు, దోమపోటు పరిహారాన్ని రైతులకు అందజేశామన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక రైతులు సాగుకు సిద్ధమవుతున్నా, సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టకపోవడంతో శివారు భూములకు నీరందే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలు, చెరువులు ఎక్కడికక్కడ గుర్రపుడెక్కతో పేరుకుపోయాయని తెలిపారు. రైతులకు రుణాలు గానీ, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు గానీ ఇవ్వడం లేదన్నారు. రైతుభరోసా కేంద్రాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయన్నారు. రైతుల సమస్యలపై టిడిపి పోరాడుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

విద్యాసంస్థల్లో విక్రయాలపై చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం : కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలల్లో పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ డిమాండ్ చేశారు. నగరంలోని పలు ప్రయివేట్ కళాశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం సందర్శించారు. పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్ముతున్నారన్న సమాచారంతో కళాశాలలకు చేరుకుని విక్రయాలను అడ్డుకున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యాసంస్థల్లో పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు అమ్మకూడదన్నారు. కళాశాలల్లో విద్యార్థులు పుస్తకాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.సంతోష్, భరణి, జిల్లా గర్ల్స్ కన్వీనర్ స్వర్ణకుమారి, వందన పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు


ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా జైలర్ దివాకర్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఖైదీల్లో పరివర్తనతో పాటు వారి ఆరోగ్యంపైనా తగిన శ్రద్ధ కనబరుస్తున్నామని జిల్లా జైలర్ దివాకర్ నాయుడు పేర్కొన్నారు. ఖైదీల ఆరోగ్య భద్రతలో భాగంగా అంపోలు జిల్లా కారాగారంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన ఖైదీలకు వైద్య పరీక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కారాగారంలోని 57 మంది ఖైదీల నుంచి హెపటైటిస్-బి, సి, సిఫిలిస్, టిబి, హెచ్ఐవి తదితర వ్యాధులకు సంబంధించిన రక్త నమూనాలను సేకరించామన్నారు. పరీక్షల అనంతరం వ్యాధులను గుర్తించి వారికి దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన కల్పించామని తెలిపారు. ఖైదీల పరివర్తనలో మార్పు కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షల్లో వ్యాధులున్నట్లు గుర్తిస్తే జిల్లా సర్వజనాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నదీం ఖాన్, జిల్లా ఎయిడ్స్ నోడల్ అధికారి డాక్టర్ ఎస్.అనురాధ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం డిపిఎం ఎం.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


సెల్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తున్న పీడీ చిట్టిరాజు

కొలత ప్రకారం పనిచేస్తే గరిష్ట కూలి

డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పనులు కొలతల ప్రకారం రెండు పూటలా పనులు చేపట్టినట్లయితే కనీస కూలి రూ.272 వస్తుందని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఖైరలో పంట కాలువ అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టజీవుల అభ్యున్నతికి ఉద్దేశించిన ఈ పథకంలో కూలీలే యజమానులని అన్నారు. వంద రోజుల పని దినాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కూలీలందరికీ క్రమం తప్పకుండా ఉపాధిని చూపించాలని ఆదేశించారు. పంచాయతీ స్థాయిలో రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లోనూ ఉపాధి పనులు చేపట్టాలి ఆదేశించారు. ఈయన వెంట ఎపిఒ సీతారాం, జెఇ బాలము కుందబాబు, టెక్నికల్ అసిస్టెంట్ రవి ఉన్నారు.

ఎంపీగా జిల్లాకు ఎన్ని ప్రాజెక్టులు తెచ్చారు?

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

రెండు పర్యాయాలు ఎన్నికైన ఎంపీగా కింజరాపు రామ్మోహన్ నాయుడు జిల్లాకు ఏ అభివృద్ధి చేశారని, ఏమైనా ప్రాజెక్టు తెచ్చారా అని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలో తాళభద్రలో శుక్రవారం రాత్రి నూతనంగా నిర్మించిన వైసిపి జెండా దిమ్మను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ దమ్ముంటే తాను పలాస నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూపిస్తా... మీరు చేసిన అభివృద్ధి చూపించగలరా? అంటూ ఎంపీకి సవాళ్లు విసిరారు. కేవలం రైల్వేస్టేషన్లో కుర్చీలు వేసి ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పలాకు డిఆర్ఎం వచ్చారు కదా? నర్సిపురం కాలిబాట ఎందుకు తెరిపించలేకపోయారని ప్రశ్నించారు. అనంతరం కొంతమందికి వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, బోరకృష్ణారావు, కౌన్సిలర్ కర్రి మాధవరావు, నీలాపు నారాయణ, సనపల సింహాచలం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గ టికెఆర్ కళ్యాణ మండపంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస నియోజకవర్గం అభివృద్ధికి వేల కోట్లు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. పలాసలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, ఆమె భర్త వెంకన్న చౌదరి


మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

చరిత్ర ముగిసిందన్నారు. గతంలో గత పాలకులు గొడవలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ పలాస నియోజకవర్గాన్ని ప్రశాంతత లేకుండా చేశారని అన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మందస ఎంపిపి డొక్కరి దానయ్య, జెడ్‌పి వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణ చంద్రరావు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పిల్లల ఉత్తమ భవిష్యత్‌కు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులూ శ్రద్ధ వహించాలని ఎంఇఒ అప్పారావు అన్నారు. మండలంలోని పురుషోత్తపురం మున్సిపల్ స్కూల్‌లో దివ్యరెడ్డి, మున్సిపల్ గర్ల్ హైస్కూలక్ష పూజ, ప్రభుత్వ పాఠశాలకు చెందిన పరపటి నీతూ, ఈదిపురానికి చెందిన బాసి ప్రసన్న, మెడల్ స్కూల్‌కు కిరణ్‌సాహు ఇటీవల ప్రతిభా పురస్కారాలు పొందారు. ఈ మేరకు ఇచ్ఛాపురం లయన్స్‌క్లబ్ తరుపున పురుషోత్తపురం స్కూల్ శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో పురుషోత్తపురం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లత, ఇంజినీరింగ్ ఎఇ అనిల్‌కుమార్, పిఆర్‌ఒ దక్కత గోపీనాథ్‌రెడ్డి, ఉమాశంకర్, ప్రకాష్, సత్యమయ్య, రమణ, నరసింహమూర్తి, ఎల్.వెంకటరావు పాల్గొని నగదును అందజేశారు.

విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ విజ్ఞానం అవసరం

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధరరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థులలో విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి మురళీధరరావు అన్నారు. మండలంలోని దూసి, వంజంగి, తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ప్రగతి స్వాలంబన కోసం సైన్స్ అన్న నినాదాలతో 35 ఏళ్ల నుంచి జన విజ్ఞాన వేదిక పనిచేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సంస్థలో చేరి ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎంతో ప్రగతిని సాధిస్తూ మానవుడు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నారని అన్నారు.


మాట్లాడుతున్న మురళీధరరావు

ప్రస్తుతం మతమౌఢ్యంతో, మూఢనమ్మకాలతో కొంతమంది కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకుల కూర్మాన షణ్ముఖరావు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు జె.స్వప్నప్రియ, ఎ.సింహాచలం, కె.రామకృష్ణ, పి.పారినాయుడు, బి.వాణి, హెచ్.అప్పారావు, పి.సాయిసుజాత పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు

గెస్ట్ ఫ్యాకల్టీలను కొనసాగించాలి

శ్రీకాకుళం అర్బన్ : ప్రభుత్వం జోక్యం చేసుకుని కెజిబివిలో పనిచేస్తున్న గెస్టు ఫ్యాకెల్టీ టీచర్స్‌ను, లెక్చరర్స్‌ను యథావిధిగా కొనసాగించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు కార్యాలయం ఆధ్వర్యాన నడుస్తున్న కెజిబివిల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలను సిఆర్‌టిలుగా నియమించి యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఎపి సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 32 కెజిబివిల్లో 150 మంది గెస్టు ఫ్యాకల్టీ టీచర్స్, లెక్చరర్స్‌ని సిఆర్‌టి, పిజిటిలుగా 8 ఏళ్లుగా పనిచేస్తున్నారని అన్నారు. డిగ్రీ, బిఇడి, పోస్టు గ్రాడ్యుయేషన్ అర్హత కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఏటా నోటిఫికేషన్ ఇచ్చినా వీరంతా అర్హత కలిగి ఉన్నారన్న కారణంగా కొనసాగిస్తున్నారని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో రెగ్యులర్ చేస్తామని కూడా గతంలో చెప్పారని, దానికి విరుద్ధంగా ఈ విద్యా సంవత్సరం నోటిఫికేషన్ ఇచ్చారని అన్నారు. అనుభవం ఉన్న వీరికి ప్రాధాన్యత ఇవ్వకుండా కొత్త వారిని పిలిచి ధ్రువపత్రాలు పరిశీలించడం సరికాదన్నారు. ఇప్పుడు అర్ధాంతరంగా వీరిని గాలిలో ఉంచడం వల్ల ఈ ఉద్యోగాలపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురు కానున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారందరినీ కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.ధనలక్ష్మి, వి.ఎన్.సునీత, సావిత్రి, ఎస్.స్నేహలత, డి.కల్పన పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

ఆమదాలవలస : అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడికే దక్కిందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కనుగులవలస పంచాయతీ కొండపేట, కంచరావు వానిపేటల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నది? లేనిది? లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబిల్లి శ్రీనివాసరావు, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్‌బాబు, పాతిన వరాహనరసింహం, ఎపిఎం పైడి కూర్మారావు పాల్గొన్నారు.

లావేరు : సమస్యలు పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తామడ పంచాయతీ కొత్తరౌతుపేటలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.


మాట్లాడుతున్న విజయ

విద్యకు ప్రాధాన్యం

సోంపేట: విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ దుంపల చిన్నాజీవర్మ అధ్యక్షతన ఆణిముత్యాలు పురస్కారాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే దేనినైనా సాధించవచ్చునని అన్నారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరికీ పట్టుదల, ఏకాగ్రత, చిత్తశుద్ధి, సోదరభావం కలిగి ఉండాలని ఉండాలన్నారు. అనంతరం పది, ఇంటర్మీడియట్‌లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులక, తల్లిదండ్రులకు, సోంపేట ఎంపిపి డాక్టర్ నిమ్మన దాస్ దుశ్శాలువ కప్పి సన్మానించారు.

నాయీబ్రాహ్మణులకు టిడిపి అండ

శ్రీకాకుళం అర్బన్ : నాయీబ్రాహ్మణులకు టిడిపి అండగా నిలుస్తుందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని ప్రజా సదన్‌లో నాయీబ్రాహ్మణ సాదికార కమిటీ సభ్యులు శురకవారం ఎంపీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు గడచిన నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. అరసవల్లిలో నాధస్వరం, వాయిద్యం పాఠశాల నెలకొల్పడానికి టిడిపి ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేస్తే... ఈ నాలుగేళ్లలో పాఠశాల సంగతే మరచిపోయారని అన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు కుప్పిలి వెంకటరావు, సాధికార కమిటీ సభ్యులు శ్రీను, గోరింట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పాలపోలమ్మ ఆలయంపై

పెత్తనం సరికాదు

ఆమదాలవలస : పట్టణంలోని కృష్ణాపురం పాలపోలమ్మతల్లి ఆలయంపై పెత్తనం చేయడానికి అధికారం శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఎవరు ఇచ్చారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ప్రశ్నించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెలుగా ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది ప్రయివేటు ఆస్తుల కబ్జా, నాగావళి, వంశధార ఇసుకను దోచుకోవడానికి కాదని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు, రాడ విజయ్ కుమార్, తోట రాము తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదు చేస్తున్న కూలీలు

మస్టర్లు వేయడం లేదని ఫిర్యాదు

పొందూరు: ప్రతిరోజూ పనికి వెళ్లినా తమకు మస్టర్లు వేయడం లేదంటూ మండలంలోని బురిడికంచరాంకు చెందిన కూలీలు వాపోయారు. ఈ మేరకు ఎపిఒ శ్రీనివాసరావును కలిసి శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన వండాన హైమావతి గ్రూపులో వంద మందికికి పైగా పనిచేస్తున్నారని అన్నారు. మేము వారం రోజులు పనికి వెళ్తున్నా రెండు, మూడు రోజులు మాత్రమే మస్టర్లు వేస్తున్నారని వాపోయారు. పక్క గ్రూపుల్లో పనికి వెళ్లినా, వెళ్లకపోయినా మస్టర్లు పూర్తిగా వేస్తున్నారని, దీనిపై అడిగితే నా ఇష్టమంటూ ఎఫ్ఎ అంటున్నారని వారంతా ఆరోపించారు. అలాగే పేమెంట్ కూడా పూర్తిగా రావడం లేదని పేర్కొన్నారు. మేము పనిచేసే సమయంలో పని ప్రదేశానికి ఆయన రాకుండా వేరే వ్యక్తులతో మస్టర్లు వేయిస్తున్నారని అన్నారు. ఈ నెల 22,23వ తేదీల్లో పనిచేస్తున్నా... అసలు మస్టర్లు వేయలేదన్నారు. ప్రతి సోమవారమూ మస్తరు వేయడం లేదంటూ ఫిర్యాదు చేశారు.

మృతుని కుటుంబానికి బాసట

సోంపేట : మండలంలోని మామిడిపల్లిలో గేదెల శ్యామసుందరరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్నేహితులు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.30 వేలు ఆర్థికసాయం అందజేసి బాసటగా నిలిచారు. ఈ మేరకు మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 లో పదవ తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల్లో మామిడిపల్లి చేరుకున్నారు. ముందుగా వ్యామసుందర రావు చిత్రపటానికి పూలమాలవేసి కన్నీటిపరమతమయ్యారు. మృతునికి భార్యతో పాటుగా ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. పిల్లలు చదువుకునేందుకు, ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బంది ఉన్నా తమకు సంప్రదించాలని ఆదుకుంటామని భరోసానిచ్చారు.

ఇద్దరు అరెస్టు

మెళియాపుట్టి : మండలంలో పెద్దపద్మాపురానికి చెందిన గొట్టిపల్లి నారాయణమ్మ మెడలోని గొలుసు ఇటీవల దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేశామని ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. ఇటీవల నారాయణమ్మ మెళియాపుట్టి నుంచి పెద్దపద్మాపురం ఇటీవల ఆటోలో వెళ్తుందన్నారు. ఆటోలో ఉన్న గొర్లె పెద్దింటమ్మ నారాయణమ్మకు మాయమాటలు చెప్పి ఆమె మెడలోని బంగారు గొలుసు దొంగలించింద న్నారు. ఈ దొంగతానికి ఆటోడ్రైవర్ పాల వేణు సహకరించినట్లు దర్యాప్తులో రుజువు కావడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

రోడ్లు జలమయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

శుక్రవారం వేకువజాము నుంచి కురిసిన తేలికపాటి వర్షానికి పలు రహదారులు జలమయంగా తయారయ్యాయి. మండలంలోని వెంకటాపురం, బెండి, నౌపడ ఆర్అండ్‌బి రహదారుల గోతుల్లో నీరు చేరి నిల్వ ఉండిపోయింది. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం ఆరంభంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే... భారీ వర్షాలు కురిసే సమయంలో రోడ్ల పరిస్థితి మరి అధ్వానంగా తయారవుతుందని స్థానికులు అంటున్నారు. పూండి బస్టాండ్‌లో సిసి


పూండీ రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపునీరు

రోడ్ నిర్మించినా డ్రెయినేజీ నిర్మించకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో గోతులు కానరాక ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. తక్షణమే మండలంలోని పలు రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవి



మాట్లాడుతున్న చింతాడ రవి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రం పరుగులు తీస్తుందని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారిక తదితర రంగాల్లో ఈ నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. 2014-19 మధ్య చంద్రబాబు పాలనలో కోటి మంది ప్రజలు కటిక పేదరికంలోకి వెళ్లారని, గ్రామీణ చిన్నారులు పౌష్టికాహార లోపంతో బాధపడేవారని అన్నారు. ప్రతి ఆరుగురు చిన్నారుల్లో ఒకరు ప్రాథమిక విద్యకు దూరం అయ్యారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలను మూసివేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని ఎద్దేశా చేశారు. సమావేశంలో వైసిపి ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షులు ఆదిరెడ్డి, నాయకులు కొప్పుల ఈశ్వరరావు, ముద్దాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'నవోదయ'కు ఉచిత శిక్షణ

టెక్కలి రూరల్ : టెక్కలిలో 19 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులను విజేతలుగా నిలిపిన న్యూ బ్రిలియంట్ కోచింగ్ సెంటర్‌లో నవోదయ పరీక్షలకు ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు డైరెక్టర్ దేవాది శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఫీజ్‌లో రాయితీ ఇస్తున్నట్లు తెలియజేశారు. నవోదయకు ప్రవేశ పరీక్షలకు అప్లయి చేయాలనుకునే విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్‌టిఆర్ నగర్ 5వ లైన్‌లో ఉన్న న్యూ బ్రిలియంట్ కోచింగ్ సెంటర్ వద్దకు వచ్చి ఉచితంగా అప్లికేషన్లు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9441116108 నంబరును సంప్రదించాలని కోరారు.

డిజిటల్ విద్య ఉపయోగకరం

ఇచ్ఛాపురం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు డిజిటల్ విద్యావిధానం ఉపయోగకరంగా ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామల సింహాచలం అన్నారు. ప్రభుత్వం పాఠశాలకు సరఫరా చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పి) పరికరాలు అమర్చిన విధానం, పనిచేస్తున్న తీరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నత పాఠశాలలకు ఐఎఫ్‌పి పరికరాలను అందచేసి, ఇంటర్‌నెటట్ సౌకర్యం కల్పించడం ద్వారా డిజిటల్ విద్యావిధానంలో విద్యార్థులు ఆసక్తికరంగా నేర్చుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సువర్ణావకాశమని అన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

నందిగాం : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ అని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ అన్నారు. నందిగాం చెత్త సంపద తయారీ కేంద్రంలో శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం చెత్త సంపద తయారు చేసే విధానం, షెడ్డును పరిశీలించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో జగనన్న సురక్షపై ఉద్యోగులు చేయాల్సిన విధులపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కె.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందనలు

మెళియాపుట్టి : మండలంలోని పెద్దమడి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గేదెల నికిత, సవర అనులను వైస్ ఎంపిపి ఆదినారాయణ, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో గిరిజన పాఠశాల విభాగంలో బాలికలు అత్యధిక మార్కులు సాధించడంతో సిఎం జగన్మోహన్‌రెడ్డి అభినందించడం ఆదర్శనీయమైన, విద్యార్థులు మరింత ఉన్నంత స్థాయికి ఎదగాలని అన్నారు. పాఠశాలకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.ప్రసాదరావు, హెచ్ఎం శారద, ఎస్ఎంసి చైర్మన్ ఎస్.జానకమ్మ పాల్గొన్నారు.

సమన్వయంతోనే విద్యాభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న పగడాలమ్మ

టెక్కలి : విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ నూతనంగా భాద్యతలు స్వీకరించిన ఎంఇఒలు, మండల విద్యాశాఖాధికారుల సమన్వయంతో కృషి చేస్తే విద్యాభివృద్ధి సాధ్యమని టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ సూచించారు. స్థానిక ఉప విద్యాశాఖ కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఎంఇఒలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కిట్లు పంపిణీలో పారదర్శకత ఉండాలన్నారు. ప్రతి విద్యార్థీ వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు తనిఖీకి వెళ్లినప్పుడు విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరీక్షించాలన్నారు. విద్యా సంవత్సరం ఆరంభం నుంచే ప్రణాళిక రూపొందించుకుని వాటిని అమలు పరిచేలా విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరు ముద్ద పథకం అమలులో ఎటువంటి ఆలసత్వం ప్రదర్శించకుండా మెనూ ఆమలుల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని ఎంఇఒలు దాసరి నాగభూషణం, దాసుపురం చిన్నారావు, నర్సింహులు, అన్నుపురం చిన్నారావు, సవర దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభం, డి.చిన్నవాడు, ఉపవిద్యాశాఖ కార్యాలయ సిబ్బంది భాస్కరరావు, కుప్పిలి ప్రకాష్, కుప్పిలి నగేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపుతో ప్రజలపై భారం


టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న షణ్ముఖరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రతిఒక్కరూ ప్రతిఘటించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వల్లే ప్రజలపై భారాలు పడుతున్నాయని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు అన్నారు. టెక్కలి సిఐటియు కార్యాలయం వద్ద విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా వామపక్షాల, ప్రజా సంఘాల నాయకులతో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 30న విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ప్రజా ఆస్తులన్నీ ధారాదత్తం చేస్తున్నారని అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా తమ హక్కులను సాధించుకోగలమన్నారు. సర్దుబాటు ఛార్జీల విధానాన్ని రద్దు చేయాలన్నారు. ట్రూ అఫ్, సర్దుబాటు ఛార్జీలు వసూళ్ల నిలిపివేయాలన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హెచ్.ఈశ్వరరావు, సిపిఐ నాయకులు యం.యుగంధర్, ప్రగతిశీల కార్మిక సంఘం నాయుకులు కోళ్ల పాపారావు, కెఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు బెలమర ప్రభాకరరావు, బగాది వాసు, వెంకటరావు, ఉదయ్, శాంతారావు పాల్గొన్నారు. అలాగే నందిగాంలో నిర్వహించిన సమావేశంలో షణ్ముఖరావు పాల్గొని మాట్లాడారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఎపి మోడల్ స్కూల్‌లో 2023-24 విద్యా సంవత్సరానికి 7,8,9 తరగతుల్లో ఖాళీ సీట్లు భర్తీ చేసేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 27 సాయంత్రం నాలుగు గంటలలోగా పాఠశాలలో అందజేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 28న పాఠశాలలో ప్రవేశ పరీక్షను నిర్వహించినట్లు చెప్పారు. పూర్తి వివరాలకు పాఠశాలను సంప్రదించాలని కోరారు.


నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ ప్రతినిధి ఊర్ణ వెంకటేశ్వరరావు (పెద్దబాబు)కు చెందిన లక్ష్మీ టాకీస్ ఎదురుగా ఉన్న ప్రహరీని తొలగించడం సరికాదని మాజీ మ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు థియేటర్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దశాబ్దాలుగా క్రితం లక్ష్మీ టాకీస్‌కు నిర్మించారని, ఇప్పుడు టిడిపి చెందిన వ్యక్తి అని చెప్పి వైసిపి నాయకులు ధ్వంసం చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దీనిపై హైకోర్టు ఎటువంటి చర్యలు తీసుకోరాదని ఉత్తర్వులు ఉన్నా ప్రహరీని తొలగించడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ టోర్నీ ప్రారంభం


బహుమతిని అందజేస్తున్న సిఐ ఈశ్వరప్రసాద్

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం సురంగి రాజావారి మైదానంలో భానుమతి నర్సింగరావు స్మారక మహిళ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను స్థానిక క్రికెట్‌క్లబ్ ఐసిసి అధ్యక్షులు దాసరాజు, చీఫ్ కోచ్ గోపి ప్రారంభించారు. ఈ మహిళా క్రికెట్ టోర్నమెంట్‌కు హైదరాబాద్ జిఎన్ఆర్ క్రికెట్ అకాడమీ డైరెక్టర్ సామినేని గోపాలరావు, తల్లిదండ్రులు భానుమతి నరసింహరావు స్మృతి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఐసిసి క్రికెట్ క్లబ్ మెడికల్ అడ్వైయిజర్ ఉలాల శేషు యాదవ్, సరోజ్ కుమార్‌గౌడ, పైడిశెట్టి దినేష్, రామారావు పాల్గొన్నారు. తొలిరోజు మ్యాచ్‌లో బ్యాటింగ్ చేసిన ఒరిశా ఆల్ఫా క్లబ్ టీమ్ 90 పరుగులు చేసింది. తదుపరి బ్యాటింగ్ చేసిన శ్రీకాకుళం మహిళా జట్టు 82 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో బెస్ట్ బ్యాట్‌మెన్‌గా శ్రీలత, బెస్ట్ బౌలర్‌గా సరయు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మోనాలిసా బిస్వాలు ఎంపికయ్యారు. వీరికి సిఐ ఈశ్వరప్రసాద్ బహుమతిని అందజేశారు.

పోలీసు పహారా మధ్య సమావేశాలు

పలాస: పలాస నియోజకవర్గంలో టిడిపి, వైసిపి మధ్య రోజురోజుకూ వార్ తారాస్థాయికి చేరుకుంది. ఒకేరోజు రెండు పార్టీల నాయకలూ సమావేశాలు నిర్వహిండంతో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ తాళభద్ర ప్రజలు అయోమయంలో పడ్డారు. మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డు తాళభద్రలో శుక్రవారం రాత్రి టిడిపి, వైసిపి నాయకులు సమావేశాలు నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం సమావేశం నిర్వహించేందుకు టిడిపి నాయకులు పోలీసులకు అనుమతి కోరారు. టిడిపికు పోటీగా వైసిపి నాయకులు అదే గ్రామంలో సమావేశం నిర్వహించారు. అయితే పోలీసు పహారా మధ్య ముందుగా రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు 6.45 నిమిషాలకు తాళభద్ర చేరుకొని గంటపాటు కార్యక్రమం నిర్వహించారు. అలాగే రాత్రి 8 గంటల సమయంలో టిడిపి నాయకులు తాళభద్రకు చేరుకుని కార్యక్రమం నిర్వహించారు. కేవలం గంట సమయం వ్యత్యాసంలో సమావేశం నిర్వహించడంపై గ్రామంలో ఎటువంటి ఘటనలు జరుగుతాయోని గ్రామస్తులు ఆందోళన చెందారు. ఇదిలా ఉండగా, పదుల సంఖ్యలో పోలీసులు పహారా నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.


పహారా కాస్తున్న పోలీసులు